క్లుప్తంగా

యాగంటి క్షేత్రంలో ఎమ్మెల్యే కాటసాని పూజలు



యాగంటిలోని వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఘనస్వాగతం పలికారు. ఉమామేశ్వర స్వామి, గణపతి స్వామి, నందీశ్వరులను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అవకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెడదల రామచంద్రారెడ్డి, చిన్నప్పురెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి



కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండల వైఎస్సార్‌సీపీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా మీర్జాపురం గ్రామానికి చెందిన లాయర్ మహేశ్వరరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించిందని జిల్లా ప్రచారకార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఆదివారం చెప్పారు. మండలంలో పార్టీ బలోపేతం,త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచన మేరకు మహేశ్వరరెడ్డి నియామకం జరిగిందన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

డోన్ టౌన్ : స్థానిక ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ దాతల సహకారంతో ప్రతి ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో చేపట్టే కొనసాగింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వీరాభిమాని దివ్యాంగుడు మహేష్ ఆర్థిక సాయంతో జాన్ ప్రభాకర్ గర్భిణులు, బాలింతలతోపాటు రోగులకు రొట్టె, గ్రుడ్డు, పప్పు అందజేశారు. దివ్యాంగుడు మహేష్‌ను ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, రోగుల బంధువులు అభినందించారు. కార్యక్రమంలో రాజేష్, శ్రీజ, శ్రీవిద్య, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



రెసిడెన్షియల్ స్కూలు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన, చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపాన పలు అభివృద్ధి పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈనెల 27వ తేదిన ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం గోరుమానుకొండ గ్రామ సమీపాన కర్నూలు రహదారిలో రూ. 36 కోట్లతో నిర్మించిన బీసీ బాలుర రెసిడెన్సియల్ స్కూలు, కళాశాల, రూ. 8 కోట్లతో చేపట్టిన ఐటీఐ కళాశాల, రూ.4 కోట్లతో నిర్మించిన ఎంఎస్‌ఎమ్ యూనిట్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కంట్రాక్టర్‌కు సూచించారు.

వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబుల్ రెడ్డి



బేతంచెర్ల: మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సురేంద్రనాథ్‌రెడ్డి (బాబుల్ రెడ్డి)ని రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ పార్టీ ప్రారంభం నుంచి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెంట నడుస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయడంతోనే తనకు పదవి వరించిందని బాబుల్ రెడ్డి తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

సీఎం అన్నివర్గాల సంక్షేమానికి కృషి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. ఆదివారం ప్యాపిలి మండలంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వెటర్నరీ పాలిటెక్నిక్, గొర్రెల పెంపకం దారుల శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం వైభవంగా సాగిందన్నారు.

సీసీ రోడ్లు మెరిసే.. గుడిపాడు మురిసె!

- ఏళ్ల తరబడి బురదలో మగ్గిన ప్రజలు
- మంత్రి బుగ్గన చొరువతో రూ. కోటితో రోడ్ల నిర్మాణం
- కళకళలాడుతున్న గుడిపాడు, హెచ్‌ఆర్‌పల్లి, బోయవాండ్లపల్లి
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గుడిపాడు ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద వేసిన సీసీ రోడ్డు



గుడిపాడులో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వీధిలో వేసిన రోడ్డు

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సక్షమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది. మండల కేంద్రాలతోపాటు గ్రామాలు, మజరా గ్రామాల్లోనూ మౌలిక వసుతుల కల్పిస్తుంది ప్రభుత్వం. దీంతో ఏళ్లతరబడి బరదమయం అయిన గ్రామాలు సీసీ రోడ్లుతో కళకళలాడుతున్నాయి. ఇందుకు సాక్ష్యం మండల కేంద్రం ప్యాపిలి సమీపానున్న గుడిపాడు, మజరా గ్రామాలైన హెచ్‌ఆర్‌పల్లి, బోయవాండ్లపల్లి. నేడు గుడిపాడు రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతుంది. మజరా గ్రామాల్లోకూ మౌలిక వసతులు చేకూరాయి. ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుడిపాడు సచివాలయ పరిధిలోని గుడిపాడులో 2048 మంది, బోయవాండ్లపల్లిలో 348 మంది, హెచ్‌ఆర్ పల్లి గ్రామంలో 413 మంది నివాసం ఉంటున్నారు. ఏళ్లతరబడి సమస్యలతో సతమవుతూనే ఉన్నారు. కనీసం రోడ్లు వసతి లేక రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షా కాలంలో గుడిపాడు బురద గుంటలకు నిలయంగా ఉంటుంది. ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహించేది. దుర్వాసన, ఈగలు,దోమల వ్యాప్తితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రజలు బురదలో మగ్గారు. మజరా గ్రామాల పరిస్థితీ అంతే. ఈ సమస్యలకు వైస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో రూ. కోటితో సీసీ రోడ్లు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు రోడ్లు మెరిసే గుడిపాడు మురిసే.. అనేలా ఉందీ పరిస్తితి.



రూ. కోటితో సీసీ రోడ్లు, పైప్‌లైన్లు

గుడిపాడు గ్రామ సచివాలయ పరిధిలోని గుడిపాడు, బోయవాండ్లపల్లి, హెచ్‌ఆర్ పల్లి తదితర గ్రామాల్లో ఇప్పటి వరకు రూ. కోటి వ్యయంతో సీసీ రోడ్లు, పైప్‌లైన్ పనులు, గ్రావెల్ రోడ్లు తదితర పనులు చేపట్టారు. పనుల వివరాలు ఇలా ఉన్నాయి.

- హెచ్‌ఆర్ పల్లి గ్రామం నుంచి శ్మశానవాటిక వరకు రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- హెచ్‌ఆర్ పల్లి నుంచి ఊరిబావి వరకు రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు



హెచ్‌ఆర్‌పల్లిలో వేసిన సీసీ రోడ్డు

- బోయవాండ్ల పల్లిలో రంగస్వామి ఇంటి నుంచి మద్దిలేటి స్వామి ఇంటి వరకు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు
- గుడిపాడులో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకి నుంచి శివయ్య ఇంటి వరకు రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు
- శివయ్య ఇంటి ఉంచి దర్గా వరకు రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు

సీసీ రోడ్ల పనులు పూర్తి చేశాం



గుడిపాడు, హెచ్‌ఆర్ పల్లి, బోయవాండ్లపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు కావాలని ప్రజా ప్రతినిధులు కోరారు. వెంటనే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో పనులు వెంటనే మంజూరయ్యాయి. పనులు కూడా త్వరితగతిన పూర్తి చేశాం. మరికొన్ని వీధుల్లో కూడా సీసీ రోడ్లు వేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. – ప్రభాకర్ రెడ్డి, పీఆర్ ఏఈ

- బొడ్రాయి నుంచి ఓబులేసు ఇంటి వరకు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు
- ఆకుల గోవిందు రెడ్డి ఇంటి నుంచి కుల్లాయప్ప ఇంటి వరకు 2.06 లక్షలతో సీసీ రోడ్డు

ఏళ్లతరబడి బురదతో ఇబ్బంది పడ్డాం



రోడ్డు సరిగా లేనందున చాలా ఇబ్బంది పడ్డాం. వర్షం వస్తే రోడ్లు బురద మయం. బురద కారణంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన కూడా పడ్డాం. ప్రభుత్వం మా వీధికి సీసీ రోడ్డు మంజూరు చేసి త్వరగా పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉంది. ఇప్పుడు బురద సమస్య తీరిపోయింది. రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. సీసీ రోడ్డు వేస్తారని ఎన్నో ఏళ్లగా ఎదురు చూసిన మా కల నెరవేరింది. మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు.
– రాశి, హెచ్‌ఆర్ పల్లి

అడిగిన వెంటనే స్పందించారు



మా వీధికి రోడ్డు వేయాలని నాయకులను, అధికారులను అడిగిన వెంటనే స్పందించారు. ప్రజాప్రతినిధులు మా వీధిలో పర్యటించినప్పుడు సమస్యలపై ఆరా తీశారు. సీసీ రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని చెప్పాం. వెంటనే అధికారులు కూడా స్పందించి రోడ్డు వేయించారు. అడిగిన వెంటనే రోడ్డు వేయడం ఈ ప్రభుత్వంలోనే చూశా. చాలా సంతోషంగా ఉంది.
– పులికొండ, గుడిపాడు

- రామాంజనేయులు ఇంటి నుంచి గురుదాసు ఇంటి వరకు రూ.2.06 లక్షలతో సీసీ రోడ్డు

డ్రైనేజీ, గ్రావెల్ రోడ్డు

- కలుమిట్ట నుంచి నర్సయ్య ఇంటి వరకు రూ. 2 లక్షలతో డ్రైనేజీ
- నర్సయ్య ఇంటి నుంచి వంక వరకు రూ. 2 లక్షలతో డ్రైనేజీ
- ఓహెచ్‌ఎస్‌ఆర్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు రూ. 1 లక్షతో పైప్‌లైన్
- సుంకులమ్మ గుడి నుంచి రెడ్డికుంట వరకు రూ. 20 లక్షలతో గ్రావెల్ రోడ్డు

క్రికెట్ విజేత పెద్దపొదిళ్ల జట్టు



పెద్దపొదిళ్ల జట్టును అభినందిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆడుదాం ఆంధ్రా క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్‌లో ప్యాపిలి–1 సచివాలయం జట్టు పెద్దపొదిళ్ల జట్టుతో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన పెద్దపొదిళ్ల జట్టు నిర్ణీత ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 87 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ప్యాపిలి జట్టు ఆరు ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది. పెద్దపొదిళ్ల జట్టులో రాజశేఖర్ అత్యధికంగా 48 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రాజశేఖర్ ఆడిన 5 మ్యాచ్‌లలో ఒక సెంచరీ, 2 హాఫ్ సెంచరీలు చేశాడు. ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టును ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ బాలకృష్ణుడు అభినందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి విజేతగా నిలిచిన జట్టుకు రూ.2 వేలు ప్రోత్సాహకం అందజేశారు.

రేపు కోవెలకుంట్లలో 'ఆరోగ్య సురక్ష'

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ గోపీనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్య శిబిరం సేలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె : స్థానిక ప్రభుత్వ యూనాని వైద్యశాలలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యశాల చీఫ్ ఆఫీసర్ హెచ్‌ఎం లైఖార్‌రహీమాన్ తెలిపారు. డిప్లొమా లేదా పీజీ యోగా సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, అనుభవం ఉన్న శిక్షకులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షకులకు నెలకు స్త్రీలకు రూ.5వేలు, పురుషలకు రూ.8వేలు అందజేస్తామని ఆయన తెలిపారు.

మంచినీటి పథకానికి మోటార్ల ఏర్పాటు

కొలిమిగుండ్ల: అవుకు రిజర్వాయర్ నుంచి మూడో ఫేజ్‌లో కొలిమిగుండ్ల మండలంలోని తొమ్మిది గ్రామాల దాహార్తి తీర్చే మంచినీటి పథకానికి సంబంధించి ఆదివారం మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న గ్రౌండ్ లెవల్ సంప్ వద్ద భారీ మోటార్లను అమర్చారు. ఈస్కీంకు సంబంధించిన పనులు పూర్తి కావడంతో ఇటీవలనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. రూ.8.5కోట్ల వ్యయంతో ప్రభుత్వం మూడో ఫేజ్‌లో బెలుం శింగవరం, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేట, బందార్లపల్లె గ్రామాలకు మంచినీటి సరఫరా కానుంది. పనులు పూర్తి కావడంతో త్వరలోనే ఈపథకాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు



వేగంగా సాగుతున్న ట్యాంకు నిర్మాణం

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశిలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో జీలజవన్ మిషన్ ద్వారా రూ. 35 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన ట్యాంకు నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వీలైనంత త్వరలో ట్యాంకు, పైప్‌లైన్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఈర్నపాటి నాగేంద్ర, కాంట్రాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.

వైభవంగా శోభా యాత్ర



ర్యాలీ పాల్గొన్న రామభక్తులు

డోన్ టౌన్ : అయోధ్యలో సోమవారం శ్రీరామమందిర ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను పురస్కరించుకొని ఆదివారం అయోధ్య రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో డోన్ పట్టణంలో వైభవంగా శోభా యాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదం మారుమోగింది. ఇందిరానగర్, కొత్తపేట మెయిన్ రోడ్డు, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, ఎస్కేపీ హైస్కూల్, పాతపేట, రైల్వే గేట్లు, రాములదేవాలయం మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభా యాత్ర సాగింది. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, కిరాణ మర్చంట్ అసోసియేషన్, గీతా యోగాసనం సభ్యులు, వెంకటేశ్వరస్వామి దేవాలయం గోస్టి మహిళలు, బజరంగ్‌దళ్ యువకులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల ర్యాలీ

ప్యాపిలి: అయోధ్య రామమందిరంలో సోమవారం బాలరాముడికి ప్రాణప్రతిష్ట చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సీతారాముల వేశధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. జై శ్రీరామ్ నినాదాలతో సాగిన ర్యాలీకి పట్టణ ప్రజలు సంఘీభావాన్ని ప్రకటించారు. కాగా బాలరాముడికి ప్రాణప్రతిష్ట సందర్భంగా పట్టణంలో హిందూ సోదరులు తమ ఇళ్లకు జై శ్రీరామ్ నినాదాలు రాసుకున్నారు. ఇళ్లపై కాషాయ జెండాలను కట్టుకుని తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, వాసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ, గుడి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వేంకటేశ్వరస్వామి ఆలయం, పాతపేట రాముల దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఆయోధ్య రామమందిర ప్రారంభోత్సవం తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉదయం 8.45 గంటల నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి రామా రాజేష్ తెలిపారు. అదేవిధంగా పాతపేట రాముల దేవాలయంలో భక్త బృందం, శ్రీరామ సేవకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు,అర్చనలు నిర్వహించనున్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపక బృందం

నేడు బైకు ర్యాలీ

డోన్ టౌన్ : అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం ఆవోపా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్కేపీ హైస్కూల్ నుంచి ఉదయం 7.30గంటలకు బైకు ర్యాలీ ప్రారంభమై పాతపేట రామాలయం వరకు సాగుతుందన్నారు. ఈ బైకు యాత్రలో పాల్గొనదలచిన వారు వైట్ అండ్ వైట్ ధరించి కాషాయం కండువతో ఉదయం ఎస్కేపీ హైస్కూల్ వద్దకు రావాలన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- కార్పెంటర్ల అభివృద్ధికి సహకారం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



కార్పెంటర్స్ కాలనీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని గ్రామ పంచాయతీ సమీపంలో 120 మందితో నూతనంగా ఏర్పాటు అయిన కాటసాని రామిరెడ్డి కార్పెంటర్స్ కాలనీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పెంటర్స్ యూనియన్ గౌరవా ధ్యక్షుడు అబ్దుల్‌ఫైజ్, డైరెక్టర్ మాలి నబీరసూల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ బనగనపల్లెలో ఎంతో మంది కార్పెంటర్స్ కార్మికులకు సొంత స్థలాలులేకపోవడంతో అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులుపడేవరన్నారు. ఎన్నికలకంటే ముందు తమ పార్టీ అధికారంలోకివస్తే కార్పెంటర్స్‌కు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. ఈ స్థలం పంపిణీ విషయంలో నాపై ఎన్నో విమర్శలు వచ్చినా ప్రతి కార్పెంటర్‌కు పార్టీలకు అతీతంగా స్థలాన్ని కేటాయించామన్నారు. కార్పెంటర్లు ఐకమత్యంగా మెలగాలని, మీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అంజేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సోదరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లె పట్టణాన్ని మోడల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.22 కోట్లతో వందపడకల ఏరియా వైద్యశాల, రూ.8 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే బైపాస్ రోడ్డుకు భూమి పూజ చేసి టెండర్లు పూర్తికాగనే రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని ప్రజలను వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, మండలల కోఆప్షన్ సభ్యులు అనిల్, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ,షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు గోపవరం గోపాల్‌రెడ్డి, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్‌హుస్సేన్, సెక్రటరీ ఉమామహేశ్వర ఆచారి, గౌరవసలహాదారులు షాబుల్,ట్రెజరర్, మహబూబ్‌బాషా, అబ్దుల్‌బాసిత్, గ్రామ పంచాయతీ ఈఓ ఖలీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్,పెద్దన్న, రహీమాన్, మహబూబ్‌వలి, షాబ్బీర్‌బాషా, వెంకట్రామిరెడ్డి, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి భూమి కొన్నావా... బీసీ!

బనగానపట్టణంలో దాదాపు 3,200 మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు తాను సర్వం సిద్ధం చేయగా.. కోర్టు ద్వారా అడ్డుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జానార్దన్‌రెడ్డి...ఎన్నికలు సమీపిస్తుండడంతో 200 ఎకరాలైనా తన సొంత డబ్బుతో కొనుగోలు చేసి ఇంటి పట్టాలు అందజేస్తామనడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కాటసాని ఎద్దేవా చేశారు. పట్టణ సమీపంలో కనీసం వంద ఎకరాలు భూమినైనా సరే కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించగలవా... ఎవరిని మభ్యపెట్టేందుకీ మాయ మాటలని నిలదీశారు. పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేక అభివృద్ధి పనులకు నీవు అడ్డుపుల్లలేసిన విషయాన్ని ఎవ్వరూ మరువలేదని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెడుతారన్నారు. ఎకరాలైనా... సొంతంగా కొనుగోలు చేసైనా... పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామంటూ ప్రచారం చేసుకుంటున్న బీసీ .... తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడీ విషయాలు గుర్తుకు రాలేదా అని ధ్వజమెత్తారు. నీ అబద్ధపు వాగ్దానాలను ప్రజలు నమ్మేపరిస్థితి లేదని, ఇప్పటికైనా వాస్తవాలు... చేయగలిగిన విషయాలు చెబితే బాగుంటుందని సూచించారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు పీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షిప్తం

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

సంజామల: మండల పరిధిలోని కమలపూరి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి పంజాబ్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర సింగ్ (45) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బనగానపల్లె మండలం పసుపలకు చెందిన ఓ వ్యక్తి హార్వేస్టర్‌కు (శనగల మిషన్) డ్రైవర్‌గా జితేంద్ర సింగ్ ఉన్నాడు. సంజామల మండలం, కమలపూరి గ్రామంలో శనగ కోత పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు. గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు హార్వేస్టర్‌కు తగలడంతో డ్రైవర్ జితేంద్ర సింగ్ అక్కడిక్కడే మృతి చెందాడు. చీకటి కావడంతో విద్యుత్ తీగలు డ్రైవర్‌కు కనపడకనే ఈ ప్రమాదం జరిగిండచ్చని గ్రామస్తుల సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అవుకు: మండల పరిధిలోని అన్నవరం గ్రామ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ఈఎంటీ పుల్లయ్య తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు పట్టణం నుంచి ఓ ట్రాక్టర్ వడ్లలోడ్‌తో బనగానపల్లె రహదారి గుండా వెళ్తుంది. టైర్ పేలడంతో ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న రవితేజ కిందపడ్డాడు. దీంతో అతని రెండు కాళ్లకు రక్త గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ పైలట్ కంబగిరిరాముడు ప్రథమ చికిత్స చేసి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

బనగానపల్లె రూరల్ : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ ఆదివారం తెలిపారు. గోవిందిన్నె గ్రామానికి చెందిన సుంకన్నగౌడ్ పలుకూరు క్రాస్ రోడ్డు వద్ద టెట్రాప్యాకెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. నిందితుడి నుంచి 27 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

బేతంచెర్ల: ప్రమాదాలకు డ్రైవర్లే కారణం అంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నిరంకుశమైన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సాధిక్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన లారీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టంలో ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 7లక్షల జరిమానా విధిస్తామని తెచ్చిన చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగితే డ్రైవర్ కుటుంబ రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

చీరల పంపిణీ



మహిళాలకు చీర, గాజులు, పసుపు కుంకుమ అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : అయోధ్యలో సోమవారం జరిగే బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఆదివారం బీరవోలు గ్రామంలోని దాతలు కుకుంట్ల గుర్రప్ప ఆయన సతీమణి కుకుంట్ల రామలక్ష్మమ్మ,చాకలి శివప్రసాద్,చాకలి కోమలి దంపతుల సహకారంతో మహిళా భక్తులకు చీరలు, గాజులు, పసుపు కుంకుమ పంపిణీ చేశారు. గ్రామంలోని సీతారామభజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీతా రామంజనేయస్వామి ఆలయంలో పూజ కార్యక్రమలతో పాటు గ్రామ పెద్దల సహకారంతో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు దాతలు తెలిపారు. అలాగే మండలంలోని పలుకూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.